ప్రజాశక్తి
సోమవారం 27 మే 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

నేటి నుంచి మళ్లీ ఎండలు



- 29 మండలాల్లో వడగాల్పులు
- మారిన వాతావరణంతో పెరగనున్న రోహిణీ ప్రభావం
- నీటి ఎద్దడితో అల్లాడుతున్న పశుపోషకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తుపాను ప్రభావం ఉమ్మడి గుంటూరు జిల్లాపై ఏమాత్రం చూపలేదు. అంతేగాక ఈ తుపాను తరువాత ఎండలు మళ్లీ పెరుగుతాయని వేడిగాలులు వీస్తాయని వాతావరణ శాఖ చెప్పినట్టే ఆదివారం నుంచి ఎండల తీవ్రత పెరిగింది. ఎండ ఎక్కువగా లేనట్టు కన్పించినా వేడిగాలి ప్రారంభం అయింది. ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

రోహిణీ కార్తె ప్రభావంతో ఎండల తీవ్రత పెరుగుతోంది. సోమవారం గుంటూరు జిల్లాలో 17, పల్నాడు జిల్లాలో 12 మండలాల్లో వేడిగాలులు వీస్తాయని ఉష్ణోగ్రత 40 నుంచి 42 డిగ్రీల వరకు నమోదు అవుతుందని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ అంచనా వేసింది. రోహిణీకార్తె ప్రభావంతో వేసవి తీవ్రత పెరగనుందని అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో జిల్లాలో వేసవి తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడుతుందని ఆశించిన వారికి నిరాశ ఎదురయింది. తుపాను ప్రభావం తరువాత వేడిగాలులు వీస్తాయని వాతావరణ శాఖ ముందే అంచనా వేసింది. అంతేగాక వేడిగాలులు పెరుగుతున్నందు వల్ల షుగర్,బిపి,గుండెనొప్పి వ్యాధిగ్రస్తులు ఎండలో తిరగవద్దని వాతావరణ శాఖ సూచించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎండల తీవ్రత కొంత ఉన్నా వడగాలి తక్కువగాఉందని సోమవారం నుంచి వచ్చేనెల 5 వరకు వడగాల్పులు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నైరుతీ రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే వరకు ఎండల తీవ్రత కొనసాగుతుంది.

మరో వైపు వేసవి తీవ్రత వల్ల ఇప్పటికే జిల్లాలోని చాలా ప్రాంతాలలో నీటి ఎద్దడి పెరిగింది. ఈఏడాది ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం తరుపున తాగునీటి ఎద్దడి, పశు గ్రాసం కొరత, రానున్న ఖరీఫ్‌కు సన్నద్ధతపై ఇంత వరకు ఉన్నత స్థాయిలో సమీక్ష జరగలేదు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి పెరుగుతున్నా జలాశయాల్లో నీరు లేకపోవడంతో ఇప్పట్లో కాల్వలకు నీరు విడుదల చేసే అవకాశం లేకపోవడంతో ఈఏడాది ఖరీఫ్ కూడా ఆలస్యం అవుతుందని భావిస్తున్నారు. గత ఏడాది వర్షాభావం వల్ల ఏర్పడిన నీటి ఎద్దడి ఇప్పటికి కొనసాగుతోంది. నాగార్జునసాగర్ జలాశయం డెడ్ స్టోరేజీ స్థాయికి నీటి మట్టం పడిపోగా పులిచింతలలో అర టిఎంసి మాత్రమే నీటి నిల్వ ఉండటంతో ఇప్పట్లో తాగునీటి అవసరాలకు కూడా నీటి విడుదల చేసే అవకాశం లేదు. ప్రస్తుతం మనుషలతోపాటు పశువు పోషకులు కూడా నీటి ఎద్దడితో అల్లాడుతున్నారు. పశువులకు నీటి సరఫరా పెనుభారంగా మారింది. గత ఆరేడునెలలుగా వర్షాలులేక పచ్చగడ్డి కొరత కూడా పెరిగింది. ప్రస్తుతం ఎండుగడ్డిమాత్రమే దొరుకుతోంది. వేసవి కష్టాలు మరో 40 రోజుల పాటు కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు. వర్షాలు విస్తారంగా కురిస్తే తప్ప ఇప్పటి కిప్పుడు నీటి ఎద్దడి తొలగిపోయే పరిస్థితి లేదు.



తురకపాలెంలో ఘర్షణలకు దిగవద్దని జాగ్రత్తలు చెబుతున్న పోలీసు అధికారులు

ఓట్ల లెక్కింపునకు పోలీసుల అప్రమత్తం

ఫలితాల అనంతరం ఘర్షణల నిరోధానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పోలింగ్ రోజున, అనంతరం జరిగిన ఘర్షణల నేపథ్యంలో పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఓట్ల లెక్కింపు అనంతరం అల్లర్లు జరగకుండా పోలీసు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గుంటూరు ఎస్‌పి తుషార్ దూడి, పల్నాడు జిల్లా ఎస్‌పి మలికా గర్గ్ పర్యటిస్తున్నారు. నరసరావుపేట, గుంటూరు లోక్‌సభ స్థానాల పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో అధికారులు అన్ని స్థాయిలో అప్రమత్తతతో వ్యవహరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

కార్డెన్ సెర్చ్, నాకాబంది పేరుతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మాక్‌డ్రిల్ నిర్వహించి ఘర్షణలకు దిగితే పోలీసులు ఎలా వ్యవహరిస్తారో కళ్లకు కట్టినట్టు చూపిస్తున్నారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, అనుమానితులను కదలికలపై నిఘా ఉంచారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజూము నుంచి ఉదయం వరకు ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు ముమ్మర తనిఖీలు చేశారు. ఎన్నికలకు సంబంధించిన పాత నేరస్తులు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేసి, రికార్డులు లేని వాహనాలను సీజ్

▶ 2లో

నేటి నుండి పాలీసెట్ కౌన్సెలింగ్

ఎంబిటిఎస్, జెఎన్‌టియులో హెల్ప్‌లైన్ సెంటర్లు - జూన్ 7న సీట్ల కేటాయింపు 8 లో



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

ఫలక్‌నామా, విశాఖ ఎక్స్‌ప్రెస్‌ల దారిమళ్లిపు - పలు రైళ్లు ఆలస్యం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నల్గొండ జిల్లా దామచర్ల మండలం విష్ణుపురం వద్ద గూడ్స్ రైలు ఆదివారం పట్టాలు తప్పడంతో గుంటూరు - సికింద్రాబాద్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు సిమెంట్ ఫ్యాక్టరీ నుండి సిమెంట్ లోడుతో మిర్యాలగూడ వెళ్తున్న గూడ్స్ రైలు విష్ణుపురం వద్ద రెండు బోగీలు ఒరిగిపోయి పట్టాలు తప్పింది. దీంతో సికింద్రాబాద్ నుండి గుంటూరు వైపు వచ్చే రైలు గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. మరో రెండు రైళ్లను అధికారులు దారి

▶ 2లో

ఓట్ల రాజకీయం నుండి పొలం గట్లపైకి

- సాగుకు సిద్ధమమైన రైతులు
- వర్షాల నేపథ్యంలో దుక్కులతో నల్లబడుతున్న పొలాలు
- ప్రణాళికలు సిద్ధం చేసిన వ్యవసాయ శాఖాధికారులు
- పెట్టుబడుల కోసం సాగుదారు నిరీక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిన్న మొన్నటి వరకు ఎన్నికల హడావుడిలో ఉన్న రైతులు తాజాగా కురుస్తున్న అదపాదడప వర్షాలతో సాగుకు సన్నద్ధం అవుతున్నారు. వేసవి దుక్కులు పనులు ఇప్పటికే మొదలుపెట్టారు. మరోవైపు వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఖరీఫ్ సాగు ప్రణాళికలను

▶ 2లో



విత్తనాలు, ఎరువుల కొరతలేదు



ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నాం. విత్తనాలు, ఎరువుల కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు సరఫరా ప్రారంభమైంది. మరికొద్ది రోజులలో రైతుభరోసా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో విత్తనాలు, ఎరువులు నిల్వ చేసి అవసరం మేరకు రైతులకు పంపిణీ చేస్తాం. ఎరువులు, విత్తనాలకు కొరత లేదు.

ఐ.మురళి, పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి.



ఈ ఏడాది పల్నాడులో ఖరీఫ్, రబీలో పంటల సాగుపై అధికారుల అంచనా (ఎకరాల్లో)

వరి	1,93,750
మొక్కజొన్న	21,725
పత్తి	3,06,250
మిర్చి	188050
అపరాలు	89,000
పసుపు	1750
ఇతర పంటలు	33100
మొత్తం	833625

ఎరువుల అవసరంపై అధికారుల అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

యూరియా	1,42,100
డిఎపి	62,385
కాంప్లెక్స్	1,12,990
ఎంఒపి	16,210
ఎస్ఎఫ్‌సి	5000
ఎఎస్	4050
మొత్తం	3,42,735



రైలు కోసం స్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

(మొదటి పేజీ తరువాయి)

మళ్లించారు. సికింద్రాబాద్ నుండి హౌరా వెళ్లే ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌ను, సికింద్రాబాద్ నుండి భువనేశ్వర్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట మీదగా అధికారులు మళ్లించారు. సికింద్రాబాద్ నుండి త్రివేంద్రం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్‌ను మిర్యాలగూడలో నిలిపివేయగా విశాఖ నుండి లింగంపల్లి వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను పిడుగురాళ్లలో, నర్సాపూర్ నుండి నాగర్సోల్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను సత్తెనపల్లిలో నిలిపివేశారు. పట్టాలు తప్పిన గూడ్స్ భోగిలను రైల్వే అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన యథావిధిగా ట్రాక్‌పైకి ఎక్కించి పునరుద్ధరించారు. శబరి ఎక్స్‌ప్రెస్ సత్తనపల్లి స్టేషన్‌కు మధ్యాహ్నం 3.40 గంటలకు రావాల్సి ఉండగా నాలుగు గంటలు ఆలస్యంగా సత్తెనపల్లికి చేరుకుంది. రైళ్లు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల కొద్ది రైల్వే స్టేషన్లో పడిగాపులు పడ్డారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను దారిమళ్లించడంతో విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడ్డారు. మిగతా రైళు యథావిధిగా రాకపోకలు సాగించాయి.



సివిల్స్ సాధనకు సమకాలీన అంశాలు కీలకం

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో కరెంట్ ఎఫైర్స్ (సమకాలీన అంశాలు) కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, కెవిఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీ పేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ఐఎఎస్ ఫౌండేషన్ తరగతుల్లో భాగంగా ఆదివారం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రపంచ పటాన్ని చూపిస్తూ అంతర్జాతీయ అంశాల ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలుగా కరెంటు ఎఫైర్స్ చదవాలన్నారు. వీటి కోసం ప్రతి రోజూ వార్తా పత్రికలు, దినపత్రికలు అధ్యయనం చేయాలని, దినపత్రికలలో ఎడిటోరియల్ పేజీలలో ఉండే వ్యాసాలు, ఎడిటోరియల్స్ చదవాలని అన్నారు. ఆర్థిక రంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, అవార్డులు, క్రీడలు, భౌగోళిక అంశాలలో జరుగుతున్న మార్పులు, కోర్టు తీర్పులు, రాజకీయ రంగం మొదలైన వాటిలో జరుగుతున్న సమకాలీన అంశాలను చదువుతూ నోట్స్ రూపొందించుకోవాలన్నారు. ప్రపంచ పటం ద్వారా అంతర్జాతీయ విభాగాలను వివరించారు.

సమ్మర్ క్యాంపులోఉత్సాహంగా పిల్లలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

చిల్డ్రన్స్ సమ్మార్ క్యాంప్‌లో పిల్లలు రెండోరోజైన ఆదివారం ఆహ్లాదంగా గడిపారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్‌లో క్యారమ్స్, చెస్, చైనీస్ చెక్కర్, బాల్ క్యాచ్ ఆటల్లో పిల్లల ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం క్యాంప్‌ను విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ కన్వీనర్ డి.రమేష్‌బాబు ప్రారంభించారు. విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు చుక్కా యానాదులు, జె.రామారావు, రైతు సంఘం నాయకులు బండి శంకరయ్య పాల్గొన్నారు.

ఓట్ల రాజకీయం నుండి పొలం గట్లపైకి

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందో? తమకు సాగు పెట్టుబడి ఎప్పుడు అందుతుందో? అని పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఓట్ల రాజకీయాల ఉత్సుకతకు కాస్తంత విరామమిచ్చి పొలం గట్లపై అడుగులేస్తున్నారు.

పల్నాడు జిల్లాలో సాగు భూమి 8 లక్షల 75 వేల ఎకరాలు ఉండగా ఇందులో 8 లక్షల 32 వేల 500 ఎకరాలు సాగవుతున్నట్లు అధికారుల అంచనా. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 34723 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం చేస్తున్నామని, కొద్దిరోజుల్లో పూర్తి స్థాయిలో రైతుభరోసా కేంద్రంలో అందుబాటులో ఉంటాయని చెబుతున్నారు.

వరి సాగులో పెట్టుబడులు పెరగడం, ధాన్యం ధరలు పెరగక పోవడం, సాగునీటి ఇబ్బందులు తదితర కారణాలతో పల్నాడు జిల్లాలో వరి సాగు విస్తీర్ణం తగ్గుతోంది. వరి రైతులు 10 సెంట్లలో వరి నారుమడి సిద్ధం చేసుకోవాలని, నారు వేసే ముందు నీటిలో తేలియాడే తాలు గింజలు తొలగించాలని, 10 సెంట్ల నారుమడికి 500 కిలోల పశువుల ఎరువు ఎకరానికి సాధారణ పద్ధతిలో 30 కిలోల వరి విత్తనాలను 5 లీటర్ల బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తే తెగుళ్ల బెడద తగ్గి పెట్టుబడులు తగ్గుతాయని అధికారులు సూచిస్తున్నారు.

మొక్కజొన్న, పత్తి, మిర్చి, ఇతర పంటలకు సంబంధించి జిల్లాలో మధ్య కాల రకాలు సాగు చేసుకోవాలని, నేల స్వభావాన్ని బట్టి వ్యవసాయ శాఖ అధికారుల సలహా మేరకు ఆయా పంటలలో ఏ రకం విత్తనం బాగుంటుందని చెప్తే ఆ విధంగా రైతులు ముందు కెళ్లాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. భూసారంతో పాటు భూమిలో సూక్ష్మ పోషకాలను పెంచేందుకు పచ్చిరొట్ట పంటలతో పాటు నవధాన్యాలు సాగుచేయాలంటున్నారు. పచ్చిరొట్ట, నవధాన్యాల సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుందని, నత్రజని ఎరువులు పెద్దగా అవసరం ఉండదని అంటున్నారు.



రైతుల అవసరాలు క్షేత్ర స్థాయిలో తెలుసుకోవాలి

కె.రామారావు, కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు.



మండల స్థాయిలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతుల అవసరాలను అధికారులు తెలుసుకోవాలి. రైతుల నుండి అభిప్రాయాలు సేకరించి సలహాలు సూచనలు అందజేసి చైతన్యం నింపడం ద్వారా సాగు పెరిగే అవకాశం ఉంటుంది. విత్తన కోనుగోలులో రైతులు మోసపోకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందజేయాలి. కౌలు రైతులను త్వరగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. గతేడాది గుర్తింపు కార్డు కలిగిన కౌలురైతులకు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై ఇవ్వాలి. మండలానికి 500 టన్నుల పచ్చిరొట్ట విత్తనాలు అనే నిబంధన ఎత్తివేసి అవసరం మేరకు పంపిణీ చేయాలి. పెట్టుబడి సాయం, ఇతర రాయితీలు కౌలురైతులకు దక్కేలా చూడాలి.

ఓట్ల లెక్కింపునకు పోలీసుల అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. స్థానికులతో గ్రామ, వార్డు సభలు నిర్వహించి ఎన్నికల నియమావళి అమలులో ఉందని, ఘర్షణలకు దిగవద్దని హితవు పలుకుతున్నారు. ఓట్ల లెక్కింపు రోజు ర్యాలీల్లో పాల్గొనవద్దని, గొడవల్లో తలదూర్చొద్దని చెప్పారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, దీనిని అతిక్రమిస్తే అనవసరంగా క్రిమినల్ కేసులలో పాల్గొంటే వచ్చే నష్టాలను గురించి పోలీసు అధికారులు వివరించారు. పోలింగ్ రోజున ప్రజలు ఇప్పటికే తమ నిర్ణయాన్ని ఇచ్చారని, కేవలం ఫలితాలు మాత్రమే జూన్ 4వ తేదీన వెలువడుతాయనే విషయాన్ని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు గుర్తించుకుని ప్రశాంతంగా జీవిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నేరాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు.

బార్‌లను పూర్తిగా మూసివేయాలని, గుర్తు తెలియని వ్యక్తులకు లాడ్జిలు, హోటళ్లలో రూమ్‌లు ఇవ్వరాదని అధికారులునోటీసులు జారీ చేస్తున్నారు. పూర్తి చిరునామా, ఆధార్‌లు ఉన్న వారికే మాత్రమే రూమ్‌లు ఇవ్వాలని ఆదేశించారు. కార్డెన్ సెర్చ్ ఆపరేషన్, నాకాబంది కార్యక్రమాలలో ఆయా సబ్ డివిజన్ల సీఐలు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలో నల్గురు అదనపు ఎస్‌పిలు, నల్గురు డిఎస్‌పిలను ప్రత్యేకంగా నియమించారు. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పోలింగ్ రోజున ఘర్షణలు ఎక్కువగా జరగడంతో ఈ నియోజక వర్గాలపై రాష్ట్ర ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వీటితో పాటు పల్నాడు జిల్లా మొత్తం ఎన్నికల ఫలితాలు అనంతరం ఘర్షణలు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు ముందే హెచ్చరించడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఏ పార్టీ గెలిచినా మరో పార్టీ వారిపై దాడులు జరిగే ప్రమాదం ఉందని తెలుస్తుండటంతో అధికారులు నిరంతరం గస్తీని పెంచారు.



బార్ యజమానులకు నోటీసులు ఇస్తున్న పోలీసులు



మంగళగిరి రోటరీ క్లబ్ ప్రతినిధులతో లబ్ధిదారులు

ముగిసిన కృత్రిమ చేతుల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

భారతదేశంలోనే తొలిసారిగా కృత్రిమ చేతుల శత పంపిణి (జెమ్ ఎంకే1)ని విజయవంతంగా నిర్వహించి ఆ ఘనతను మంగళగిరి రోటరీక్లబ్ సొంతం చేసుకుందని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 పీడీజీ అన్నె రత్నప్రభాకర్ కితాబిచ్చారు. స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో గత సోమవారం ప్రారంభమైన మంగళకరం 2024 ప్రాజెక్టు పేరిట కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ ఆదివారం ముగిసింది. వారం రోజుల్లో మొత్తం 251మందికి 265 కృత్రిమ చేతులను అందించారు. ఈ ప్రాజెక్టును ది హ్యాండ్ ప్రాజెక్టు-జర్మనీ, అసిస్ట్-చిలకలూరిపేట, మంగళగిరి రోటరీ కరవాలంబన ట్రస్టు సౌజన్యంతో మంగళగిరి రోటరీ క్లబ్ నిర్వహించింది. అందె రేవంత్ అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకల్లో రత్నప్రభాకర్ మట్లాడుతూ కొనసాగిస్తూ ది హ్యాండ్ ప్రాజెక్టు వ్యవస్థాపకులు క్రిస్ గల్లీ నిపుణుల బృందం అంకిత భావంతో కృషి చేశారని అభినందించారు.

కార్పొరేట్ కళాశాలల వల

ప్రజాశక్తి-తాడేపల్లి

మరో నెల రోజుల్లో కాలేజీలు తెరుచుకోనున్నాయి. విజయవాడ పక్కనే గల తాడేపల్లిలో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులను వెంటాడుతున్నాయి. పది ఫలితాల్లో వివిధ పాఠశాలల సమాచారాన్ని సేకరించడంతో పాటు విద్యార్థులు అడ్రస్సులను తీసుకుని వారి ఇళ్లకు వెళ్లి జల్లెడ పడుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నిక గల రెండు కార్పొరేట్ కళాశాలలు తమ సిబ్బందిని గ్రామాలకు పంపి తమ కళాశాలలో విద్యార్థులను చదివిస్తే ఉద్యోగ బాధ్యత కూడా తామే తీసుకుంటామని నమ్మబలుకుతున్నాయి. అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు ఫీజులో కొంత రాయితీ కల్పిస్తామని చెబుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ కార్పొరేట్ మాయాజాలంలో చిక్కుకుంటున్నారు. పలానా కళాశాలలో అయితేనే చదువు బాగా వస్తుందని కార్పొరేట్ కళాశాలలు ఇచ్చిన ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లతో అటువైపు మొగ్గు చూపుతున్నారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో లక్షల రూపాయల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారు. ఆలస్యమైతే సీటు దొరకదని చెబుతున్నారు. విజయవాడ బందరురోడ్డులో ఉన్న కళాశాలలో ఇప్పటికే అడ్మిషన్లు అయిపోయాయని కళాశాల ఎదుట బోర్డు పెట్టారు. ఆ కళాశాలలో సీటు కోసం యాజమాన్యం నిర్ణయించిన దానికన్నా అధికంగా చెల్లిస్తామని తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. ఇందుకు తమ సిబ్బందిని గ్రామాల వెంట తిప్పుతూ ఒక అడ్మిషన్ చేర్పించినందుకు వేల రూపాయలు వారికి ముట్టచెబుతున్నారు. ఇది ఒక విధంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను హిప్నాటిజం చేయడమేనని విద్యా వ్యవస్థలో అనుభవం గడించిన వారు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఇవి కాకుండా ఆయా కార్పొరేట్ విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వేల రూపాయలకు అమ్మి లాభాలు గడిస్తున్నారు. తమ కళాశాలలోనే పుస్తకాలు కొనాలని యాజమాన్యం షరతులు విధిస్తుంది. కొన్ని కళాశాలల్లో బ్రిడ్జి కోర్సు పేరుతో సెలవు దినాల్లో కూడా ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజధాని పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి

విస్తృత సమావేశంలో సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులపై సూపర్వైజర్ల వేధింపులు ఆపాలని సి ఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ హెచ్చరించారు. మహిళా కార్మికుల పట్ల వేధింపులకు పాల్పడుతున్న సూపర్వైజర్లను కార్మికులంతా ఐక్యమై నిలదీయమని పిలుపునిచ్చారు. తక్షణం లైంగిక వేధింపుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం రాత్రి తుళ్లూరులో జరిగిన పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశంలో నేతాజీ మాట్లాడారు. కార్మికులు అత్యవసర సమయాల్లో సెలవులు అడిగితే పని మానేయండి అంటూ సూపర్వైజర్ల బెదిరింపులు మానుకోవాలని, పారిశుధ్య కార్మికులను చీటికిమాటికి పని నుండి తొలగిస్తామంటూ సూపర్వైజర్లు చేస్తున్న బెదిరింపులు ఆపకపోతే సి ఆర్ డి ఏ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్మికులను చీటికి, మాటికి వేధింపులకు గురి చేసే విషయంలో సి ఆర్ డి ఏ అధికారులకు, సూపర్వైజర్లకు ఉన్న శ్రద్ధ కార్మికులు చేసిన పనికి జీతాలు సక్రమంగా చెల్లించడంలో చూపిస్తే బాగుంటుందని నేతాజీ అన్నారు. మే నెల పూర్తి కావస్తున్న ఇప్పటివరకు కార్మికులకు ఏప్రిల్ నెల జీతం చెల్లించకుండా వారి కడుపులు కాల్చడం దుర్మార్గమని అన్నారు. కార్మికులకు చేయలేని పనులు అప్పగిస్తూ అదేమంటే పని మానేయండి అంటూ బెదిరింపులకు దిగటం మానుకోవాలని, చేయలేని పనులు అప్పగించే సూపర్వైజర్లకు కార్మికులు ఎదురు తిరిగి నిలదీయాలని కోరారు. తక్షణం లైంగిక వేధింపుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ, కార్మికుల హక్కులు, లేబర్ చట్టాల గురించి ఏమాత్రం తెలియని సూపర్వైజర్లు కార్మికులను తీవ్రమైన వేధింపులకు గురిచేయడం, చీటికిమాటికి పని నుండి తొలగిస్తామంటూ బెదిరింపులకు దిగటం మానుకోవాలని, లేని పక్షంలో కార్మికులతో సీఆర్డీఏ కార్యాలయం వద్ద ధర్నాకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులపై వేధింపులు మానుకోకపోతే వేధించే వారిపై లేబర్ కోర్టులో అధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. కార్మికులు ఎక్కువయ్యారు అనే వంక చెబుతూ పని నుండి తొలగించేందుకు ప్రయత్నించి వారి పొట్టలు కొట్టేందుకు చూస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదని రవి అన్నారు. రాజధాని గ్రామాల్లో భూమిలేని పేదలకు ఇస్తున్న సామాజిక పెన్షన్ రూ 5 వేలు పారిశుధ్య కార్మికులకు కూడా మంజూరు చేయాలని అన్నారు. రాజధాని పారిశుధ్య కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ లోకి తీసుకొని వారికి రూ.21 వేల జీతం చెల్లించాలని రవి కోరారు. సమావేశంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు సీహెచ్ సుశీల, వీరలంకమ్మ, సుఖవేణి, బుజ్జి, శిరీష, శేషయ్య, జోజి దుర్గా, మాలతి, జ్యోతి, గురవమ్మ, లక్ష్మి, జయమ్మ, వెంకాయమ్మ, అరుణ్ కుమార్, మధురవాణి, దేవి, లక్ష్మణరావు, హేమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతాజీ

సిజోఫినియాను తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన వైద్యం

సైక్రియాటిస్ట్ డాక్టర్ సురేష్ కుమార్ గుప్తా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో ప్రపంచ సిజోఫినియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ సురేష్ కుమార్ గుప్తా ప్రధాన వక్తగా పాల్గొని సిజోఫినియా గురించి వివరించారు. ఈ సమస్యను తొలి దశలో గుర్తిస్తే ప్రస్తుతం మంచి వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సిజోఫినియా అనే మానసిక సమస్య తొలి దశలో గుర్తిస్తే నూటికి నూరు శాతం నయం చేయవచ్చని అన్నారు. కానీ చాలామంది ఈ సిజోఫినియా సమస్యకు వైద్యం తీసుకుంటూ, ఆ వ్యాధి లక్షణాలు తగ్గగానే మందులు వాడకం మానివేస్తున్నందున ఈ సమస్య వారిలో ఇంకా తీవ్రంగా పెరుగుతుందని అన్నారు. ఈ సిజోఫినియా మానసిక సమస్యకు వైద్యం పొందుతున్న సందర్భంగా వైద్యులు తెలపనంతవరకు మందుల వాడకం ఆపకూడదని సూచించారు.ఈ సిజోఫినియా మొదటిసారి వచ్చిన సందర్భంలో డాక్టర్ సలహా మేరకు దాదాపు రెండు సంవత్సరాలు మందులు వాడాల్సి వస్తుందన్నారు. రెండవసారి ఈ సిజోఫినియా వచ్చిన రోగులలో దాదాపు మందులను ఐదు సంవత్సరముల పాటు వాడాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యాధి మూడవసారి వచ్చిన వ్యక్తి మందులను జీవితాంతం వాడాల్సి వస్తుందని తెలిపారు.రోగులు రోజు మందులు తీసుకోవలసి వస్తుందనే ఇబ్బంది లేకుండా ప్రస్తుతం లాంగ్ యాక్టింగ్ ఇంజక్షన్స్ అందుబాటులోకి వచ్చాయని, ఈ ఇంజక్షన్స్ ఒక్కసారి తీసుకుంటే ఆరోగి శరీరంలో నెల రోజులు పనిచేస్తుందని తెలిపారు.సైకాలజిస్ట్‌కి, సైక్రియాటిస్ట్‌కి బేదం తెలుపుతూ సైకాలజిస్ట్ కేవలం కౌన్సెలింగ్ చేస్తారని, అదే సైక్రియాటిస్ట్ మానసిక అనారోగ్య సమస్యలకు మందులు సూచిస్తారని తెలిపారు.మంచిగా నిద్ర పట్టడానికి పడక గదిలో ఎక్కువ వెలుతురు లేకుండా, టీవీ, సెల్ లాంటి పరికరాలు నిద్రపోయే ముందు చూడకుండా ఉండే పరిస్థితిని మనకు మనం కల్పించుకోవాలని, సాయంత్రం సమయంలో టీలు కాఫీలు తాగకుండా ఉంటే మంచిదన్నారు. నేటి సమాజంలో అనారోగ్య సమస్యలకు ముఖ్య కారణాలైన మద్యపానం, ధూమపానం లాంటి చెడు వ్యసనాలకు కూడా మంచి వైద్య సదుపాయాలు మానసిక వైద్యుల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. అల్జీమర్స్ గురించి తెలుపుతూ ప్రతి ఒక్కరూ మంచి స్నేహితుల మధ్య, మంచి వాతావరణంలో, మంచి ఆలోచనలతో సమయం గడుపుతూ ఎల్లప్పుడూ కొత్త విషయాలను తెలుసుకుంటూ పజిల్స్ లాంటి వాటిని చేస్తూ ఉంటే ఈ అల్జీమర్స్ సమస్య చాలా వరకు దరిచేరదని తెలిపారు. తర్వాత డాక్టర్ సురేష్‌కుమార్‌గుప్తాను ఘనంగా సన్మానించారు. సమావేశానికి కోఆర్డినేటర్‌గా టి.వి .సాయిరాం వ్యవహరించగా, సంస్థ సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖరరావు, ఎస్.శంకర్ రావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ఆరోగ్య సభలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌కుమార్ గుప్తా


స్థానికులతో మాట్లాడుతున్న సిఐ లు రమేష్ బాబు, దశరథ రామారావు, సుధాకర్ తదితరులు

కౌంటింగ్ పూర్తయ్యేవరకూ ఆంక్షలు కఠినం

తెనాలి త్రీటౌన్ సిఐ ఎస్.రమేష్‌బాబు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :జూన్ 4న జరగబోయే ఓట్లు లెక్కింపు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సహకరించాలాని త్రీ టౌన్ సిఐ ఎస్ రమేష్ బాబు స్థానికులను కోరారు. ఎన్నికల కమిషన్, జిల్లా ఎస్పి ఆదేశాలు అనుసారం కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకూ రాష్ట్రమంతా రెడ్ అలెర్ట్ ప్రకటించారన్నారు. శాంతి భద్రతలు దృష్ట్యా పట్టణాల్లో పోలీసు నిఘా కఠినంగా ఉంటుందన్నారు. సిఎం కాలని, ఎమ్ఎస్ పాలెం, ఇస్లాంపేట, ప్రాంతాల్లో స్టానికులతో మాట్లాడరు. ఎన్నికల ఫలితాలు అనంతరం బాణసంచా కాల్చడం నేరమన్నారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారదని హెచ్చరించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వైషమ్యాలు సృష్టించినవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. 1, 2, 3 టౌన్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఎటువంటి ఆధారాలు లేని 28 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏ కార్యాలయానికి తరలించామన్నారు. సుమారు 60 మంది సిబ్బందితో కలసి ఎం ఎస్ పాలెం, ఇస్లాంపేట ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడుతూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహింవహామన్నారు. కార్యక్రమంలో సిఐ లు దశరథ రామారావు, ఎ సుధాకర్, ఎస్సైలు పాల్గొన్నారు.

చిర్రావూరులో ఆర్టీసీ బస్సు ఢీకొని ఎనిమిది గేదెలు మృతి

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్



ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో విజయవాడ నుండి నూతక్కి వెళ్లే (215) ఆర్టీసీ బస్సు గేదెలను ఢీకొనడంతో ఎనిమిది గేదలు అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామానికి చెందిన వీరిశెట్టి బాజీ అనే రైతుకి చెందిన గేదలు గ్రామం బయట మేత మేసి, ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామంలోని రైస్ మిల్లు వద్దకు రాగానే, నూతక్కి నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు (215) వేగంగా వస్తూ, గేదెలను ఢీకొంది. దీంతో గ్రామంలోని రైతులు పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును చూస్తుంటే, వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కుడివైపున వస్తున్న గేదలను ఢీ కొట్టిందని పలువు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామంలోని ఒకే రైతుకు చెందినటు వంటి పాడి పశువులు చనిపోవడం విచారకరమని ఎపి కౌలు రైతు సంఘం నాయకులు పల్లపాటి సుబ్బారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, వీరిశెట్టి సాంబశివరావు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి, తాడేపల్లి పోలీస్‌లు దర్యాప్తు చేపట్టి, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలి

సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి

మండల పరిధిలోని చిర్రావూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన పశువుల రైతుకు నష్టపరిహారం అందించాలని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పాడి పశువులు ఎక్కువగా ఉన్న చిర్రావూరు గ్రామంలో పాడి పై జీవించే వీరిశెట్టి బాజీ అనే రైతుకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఒక్కో గేదెకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

టిడిపికి చెందిన మహిళపై కత్తితో దాడి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణం పాత వడ్డెర పాలానికి చెందిన తమ్మిశెట్టి లీలావతిపై అదే ప్రాంతానికి చెందిన ఉప్పుతోళ్ల వెంకటేష్ శనివారం రాత్రి కత్తితో దాడి చేసి గాయపరిచారు. లీలావతి టిడిపికి సపోర్టు చేశారన్న కక్షతో ఆమెపై వెంకటేష్ దాడి చేసినట్లుగా తెలిసింది. లీలావతి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.





గ్రామస్తులతో పోలీసుల సమావేశాలు

ప్రజాశక్తి - రెంటచింతల

13న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని రెంటాల, పాలువాయి గేట్ గ్రామాల్లో చోటు చేసుకున్న పరిణామాలను జిల్లా పోలీసు యంత్రాంగం సీరియస్ గా తీసుకుంది అందులో భాగంగా ఆదివారం ఏఎస్పీ (అడ్మిన్) రమణ మూర్తి నేతత్వంలో రెంటాల గ్రామంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆర్మి డిఎస్‌పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాల్వాయి గేటు గ్రామాలను సందర్శించి గ్రామ స్తులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. సాయుధ బలగాల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించి సమస్యలను సృష్టిస్తే పరిణామాలు ఏ విధంగా ఉంటాయో పోలీసులు స్పందించే తీరును కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి 144 సెక్షన్ సెక్షన్ 30 పోలీస్ యాక్టివ్ అమలులో ఉన్నందున ఎలాంటి సంబరాలు, బాణసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బహిరంగంగా హెచ్చరించారు. ప్రతి గృహాన్ని పరిశీలించారు . ఘర్షణవల్ల కలిగే అనర్ధాలను ఈ సమావేశంలో వివరించారు కార్యక్రమంలో సిఐ శివాజీ ఎస్ఐ ఆంజనేయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

66 మందిపై కేసులు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని తుమ్మరకోట, జెట్టిపాలెంగ్రామాలకు చెందిన 66 మంది పై కేసులు నమోదు చేశారు మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాలకు సంబంధించి ఈ కేసులు పెట్టినట్లు సమాచారం తుమ్మురు కోట గ్రామానికి చెందిన 46 మంది పై జెట్టిపాలెం గ్రామంలో ఇరు పార్టీలకు చెందిన 20 మంది నేతలపై కేసు నమోదు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి ఎం రమేష్

లాడ్జి నిర్వాహకులతో సమావేశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్నికలు లెక్కింపు సజావుగా పూర్తయ్యేంతవరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిఎస్పి రమేష్ అన్నారు. స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ లో లాడ్జి నిర్వహకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఓట్లు లెక్కింపు పూర్తయ్యేవరకూ అప్రమత్తంగా ఉండాలని యజమానులను హెచ్చరించారు. ఎటువంటి రాజకీయ పార్టీలకు లాడ్జీలను అద్దెకు ఇవ్వరాదని ఆదేశాలు జారీచేశారు. పోలీసు అధికారులు ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.



ఈదురు గాలులతో వాన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వెల్దుర్తి మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలతో కూడిన వర్షం కురిసింది. వెల్దుర్తి నుండి కళ్లకుంట వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న చెట్లు ఈదురు గాలులకు ప్రధాన రహదారిపై నేలకొరిగాయి. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండాదిలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి సరఫరా నిలిచింది. విద్యుత్ శాఖాధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు.



కరాటేలో ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు అభివృద్ధి కమిటీ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 20 రోజుల పాటు ఇచ్చిన కరాటే శిక్షణ ఆదివారం ముగిసింది. ఇప్పటి వరకూ చిలకలూరిపేటకు చెందిన రామకృష్ణ మాష్టారు వద్ద పలువురు చిన్నారులు శిక్షణ పొందారు. ముగింపు కార్యక్రమంలో నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్.సృజన, పి.వెంకటేశ్వర్లు (చిన్న), అభివృద్ధి కమిటీ సభ్యులు కె.రాంబ్రహ్మం, ఎ.వంశీ, పిఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు ఎన్.కాళిదాసు పాల్గొన్నారు.



డాక్టర్ లక్ష్మయ్య ఐఐటి, నీట్ అకాడమీ స్కాలర్‌షిప్ టెస్టుకు విశేష స్పందన

ప్రజాశక్తి - వినుకొండ

శ్రీ భ్రమరా టౌన్‌షిప్‌లోని డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్, ఐఐటి, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్కాలర్షిప్ టెస్ట్‌కు అనూహ్య స్పందన వచ్చింది. 6వ తరగతి నుండి ఇంటర్ చదివేందుకు ఆసక్తి ఉన్న 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలను ఆసక్తికరంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ లక్ష్మయ్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పార వెంకట లక్ష్మయ్య మాట్లాడుతూ తమ అకాడమీలో అత్యుత్తమ విద్యాబోధన, నైపుణ్యం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య, వసతి సౌకర్యాలు ఉన్నట్లు చెప్పారు. వినుకొండ ప్రాంతం నుండి ఐఏఎస్, ఐపీఎస్, ఐఐటీ, డాక్టర్లుగా తయారుచేయడమే లక్ష్యంగా విద్యా సంస్థను ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం బి.రవికుమార్, కె.శేషగిరిరావు, కొండ నాయక్, ఎం.కృష్ణాంజనేయులు, పాల్గొన్నారు.

ఎండమావిగా ఉచిత విద్య

- ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అమలవ్వని విద్యాహక్కు చట్టం
- 25 శాతం సీట్లు పేదలకు ఉచితంగా కేటాయించాల్సి ఉన్నా బేఖాతరు
- ఇద్దరు ముగ్గురు విద్యార్థులతో సరి - నమోదుపైనా ప్రచారం నామమాత్రం



ప్రజాశక్తి - పెదకూరపాడు

కేంద్రంలో యుపిఎ ప్రభుత్వం అధికారంలో ఉండగా 2009లో విద్యాహక్కు చట్టాన్ని ప్రవేశపెట్టింది. 2010లో ఈ చట్టం అమలులోకి వచ్చింది. 14 ఏళ్లలోపు వారికి ఉచిత నిర్బంధ విద్య ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ప్రతి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో 25 శాతం అడ్మిషన్లు పేదలకు ఉచితంగా కేటాయించాలి. పేద విద్యార్థుల నుంచి గాని తల్లిదండ్రుల నుంచి గాని ఎలాంటి ఫీజులూ వసూలు చేయకూడదు, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓటీల్లో పేదలకు చట్టప్రకారం కేటాయించాలి. అడ్మిషన్ల సమయంలో పాఠశాలలకు వచ్చిన దరఖాస్తుల్లో 25 శాతాన్ని విభజించాలి. వారిలో 5 శాతం సీట్లు అనాథ బాలలకు, హెచ్ఐవి బాధితులకు కేటాయించాలి. 10 శాతం సీట్లు ఎస్సీలకు, నాలుగు శాతం సీట్లు ఎస్టీలకు, 6 శాతం బీసీలకు, ఓసీల్లో రూ.60 వేలలోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి కేటాయించాలని చట్టం చెపుతోంది.

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించి వారికి చదువు చెప్పాలని, అందుకయ్యే ఖర్చును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వం చెల్లిస్తుందని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు కూడా తన తీర్పులో స్పష్టం చేసింది. ఈ చట్టం వచ్చి 14 ఏళ్లయినా ప్రైవేలు, కార్పొరేట్ విద్యాస్థల్లో ఒక్కదానిలో అయినా సరిగా అమలు కావడం లేదు.

ఆన్‌లైన్‌లో అడ్మిషన్లపై అవగాహన లేమి

ప్రైవేటు పాఠశాలలకు అనుకూలంగా ఉండే విధంగా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం మార్చిలో దరఖాస్తులను విద్య హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవాలని నిబంధన చేర్చారు. ఆ సమయంలో విద్యార్థులు ఏదోఒక పాఠశాలలో చదువుతూ ఉంటారు. పరీక్ష సమయం కావడంతో ఆ పనిలో విద్యార్థులు తల్లిదండ్రులు నిమగ్నమై ఉంటారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పెద్దగా ప్రచారం నిర్వహించలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయం ఎక్కువ మందికి అవగాహన లేదు. అట్లా అడ్మిషన్లు వచ్చిన వారు కూడా ప్రభుత్వం ఇచ్చే ఫీజులు పాఠశాలలకు చెల్లించవలసి ఉంది. పెదకూరపాడు మండలంలో ప్రైవేటు పాఠశాలలు ఐదారుండగా వీటిల్లో ఒక్కో పాఠశాలలో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే అడ్మిషన్లు పొందగలుగుతున్నారు. తాజాగా అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారి సంఖ్యకూడా చాలా పరిమితమే.



పుట్టగొడుగుల్లా ప్రైవేటు విద్యాసంస్థలు

ఆదాయమే పరమావధిగా ప్రైవేటు, కార్పొరేటు యాజమాన్యాల ఆధ్వర్యంలో పాఠశాలలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి. వాటిల్లో కనీస సౌకర్యాలు లేకపోయినా వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. కొన్ని పాఠశాలలకు ఆట స్థలాలు ఉండవు, గాలి, వెలుతురు సోకని గదులలో పిల్లలను కుక్కి పాఠాలు బోధిస్తున్నారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజకీయ పార్టీల అండదండలు ఉండడంతో విద్యాశాఖ అధికారులు కూడా చూచి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారి సత్యన్నారాయణను వివరణ కోరగా మార్చిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి ఉచితంగా సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు.

అల్లర్లకు పాల్పడితే కఠినంగా అణచివేస్తాం



సత్తెనపల్లి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పల్నాడు జిల్లా ఎఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు హెచ్చరించారు. పట్టణంలో పోలీసులతో ఆదివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్పి మాట్లాడుతూ ఎన్నికల అనంతరం జిల్లాలో పలు ప్రాంతాల్లో అల్లర్లు చోటు చేసుకున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు చేపట్టామన్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామన్నారు. వచ్చేనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరూ వివాదాలకు పోవొద్దని సూచించారు. ఎక్కడైన ఆవాంఛనీయ ఘటనలు జరిగితే తీసుకునే సత్వర చర్యలను వివరించారు. ఘర్షణలు, అల్లర్లు ఎక్కడైనా చెలరేగితే తొలుత భాష్ప వాయువును ప్రయోగిస్తామని, అప్పటికీ సద్దుమణగకపోతే లాఠీ ఛార్జి చేస్తామని, అయినా అదుపులోకి రాకుంటే గాలిలోకి కాల్పులు చేస్తామని చెప్పారు. ఈ మేరకు పోలీసు సిబ్బందితో ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ప్రజలు ప్రశాతంగా ఉండాలని, లేనిపోని గొడవల జోలికెళ్లి జీవితాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు.

ఎఎస్‌పి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో పోలీసుల మాక్‌డ్రిల్



దుర్గి

ప్రజాశక్తి - దుర్గి

మండల కేంద్రమైన దుర్గిలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్సై కోటయ్యతో పాటు 40 మంది సిఆర్‌పిఎఫ్ జవానులు, 10 మంది ఎపిఎస్‌పి పోలీసులు, 1 అడిషనల్ ఎస్పీ, ఇద్దరు సిఐలు, ఇద్దరు ఎస్ఐలు ఆధ్వర్యంలో 65 మంది పోలీసులు ఉదయం 6 గంటల నుంచి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ప్రధాన వీధుల్లో కవాతుతోపాటు అనుమానాస్పద గృహాలు, పశువుల పాకలు, నైదిబ్బలు, వరిగడ్డి వాముల్లో, నాటు బాంబులు, ఇతర మారణాయుధాలు ఏమైనా ఉన్నాయోమోనని తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వాహనాలకు ధ్రువపత్రాలున్న వారు చూపితే వాహనాలను తిరిగిస్తామని పోలీసులు తెలిపారు.



చిలకలూరిపేట మండలం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండల పరిధిలోని తాతపూడి, మురికిపూడి గ్రామాల్లో పోలీసులు రెండోరోజైన ఆదివారమూ తనిఖీలు కొనసాగించారు. రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత పోలింగ్‌లో ఎవరి అభియిష్టం మేరకు వారు ఓటేసుకున్నారని, ఇక వివాదాలను పక్కన పెట్టి శాంతియుతంగా జీవించాలని అన్నారు. ఘర్షణలు, అల్లర్లు, ఇతర వివాదాల్లో పాల్గొంటే చట్టపర్యంగా తీసుకునే చర్యలను వివరించారు. ఎవైనా సమస్యలుంటే ముందుగానే సామరస్యంగా మాట్లాడుకోవాలని, గొడవల వరకూ తెచ్చుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ జి.రవికృష్ణ, కానిస్టేబుల్ ఇర్మియా పాల్గొన్నారు.

పునాదుల్లోనే నిర్మాణం

మంగళగిరి కూరగాయల మార్కెట్ పూర్తి చేయాలని ప్రజల వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

గత కొన్ని సంవత్సరాలుగా మంగళగిరి గాంధీ బొమ్మ సెంటర్లో కూరగాయల మార్కెట్ ఉండేది. అందులో 56 మంది వ్యాపారాలు తమ దుకాణాల ద్వారా కూరగాయల వ్యాపారాన్ని కొనసాగించేవారు. మార్కెట్ భవనాన్ని 2017 సంవత్సరంలో తొలగించి దాని స్థానంలో నూతన భవనం నిర్మిస్తామని చెప్పి టిడిపి హయాంలో శంకుస్థాపన జరిగింది. అనంతరం పునాదులు వేశారు. పిల్లర్స్ కూడా పోశారు. నిర్మాణం మాత్రం జరగలేదు. 2019 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నూతన భవనాన్ని టిడిపి హయంలో కోటిన్న రూపాయలతో నిర్మించడానికి నిధులు కేటాయించారు. టిడిపి హయాంలో చేపట్టిన మార్కెట్‌ను వైసిపి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయారు. స్థానిక ఎమ్మెల్యే దీనిపై సానుకూలంగా లేరని, అందువల్ల ఈ నిర్మాణం నిలిచిపోయింది. అప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ దీని కోసం రూ.36 లక్షలకు గాను, 24 లక్ష రూపాయలు బిల్లులను గుత్తేదారులకు చెల్లించారు. ఆ తర్వాత కార్పొరేషన్ అధికారులు పునాదుల వరకు తొలగించడం జరిగింది. ఏదైనా నిర్మాణంలో లోపాలు ఉంటే, అనుమతులు లేకపోతేనో కట్టడాలను తొలగించాల్సి ఉంది. ప్రణాళిక అధికారులు అనుమతులు ఈ ఎన్ సి అప్రూవల్ ఉంది. నిలిపివేస్తున్నట్టుగాని, ఇక్కడ మిగిలిన ఇనుము తరలించే సమయంలో సమాచారం లేదని గుత్తేదారులు చెబుతున్నారు. తమ ఇనుము కనిపించకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది. ఏది ఏమైనా పాలన మారడంతో మంగళగిరిలో కూరగాయల మార్కెట్ లేకుండా పోయిందనేది వాస్తవం. పట్టణ ప్రజలు, ఇతర ప్రాంతాల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పడగొట్టినప్పుడు తాత్కాలికంగా జంతు వధశాలలో ఏర్పాటు చేశారు. ఆ మార్కెట్ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు టిడిపి నాయకులు తాము అధికారంలోకొస్తే ఆధునిక కూరగాయల మార్కెట్ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి మంగళగిరి కూరగాయల మార్కెట్ నిర్మాణం ఆధారపడి ఉన్నట్లుగా తెలిసింది.



నిర్మాణదశలో ఉన్న మంగళగిరిలో కూరగాయల మార్కెట్



చెక్కులను అందజేస్తున్న యూనియన్ బ్యాంకు సిబ్బంది

యూనియన్ బ్యాంకులో లోన్ మేళ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ మంగళగిరి బ్రాంచ్ కార్యాలయంలో ఆదివారం ఎక్స్ పో 2024 నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్ పో యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎన్ జవహర్ ప్రారంభించి మాట్లాడుతూ బ్యాంకు అతి తక్కువ వడ్డీ రేటు తో గృహ, వాహన రుణాలతో పాటు, విద్యార్థులకు రూ.20 లక్షల నుండి రూ.40 లక్షల వరకు ఎటువంటి సెక్యూరిటీ లేని విద్యా రుణాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. కేఎల్ యూ, ఎస్ఆర్ఎం, విట్, నిడ్ వంటి విద్యాసంస్థలకు రూ.40 లక్షల వరకు అంతర్జాతీయ విద్యాసంస్థలకు విద్యా రుణాల్ని ఇవ్వడం, అన్ని విధాల విద్యార్థులకు, తల్లి దండ్రులకు తోడ్పాటు అందించడం జరుగుతుంది అని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థ నాయక్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ రామాంజనేయ కుమార్, మంగళగిరి బ్రాంచ్ మేనేజర్ జోగు ప్రశాంత్, ఇతర బ్రాంచ్ మేనేజర్లో, బిల్డర్లు, కారు డీలర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాట్స్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు - 620 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

నాట్స్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నాట్స్ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ నాట్స్ వారు రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతమైన సేవా కార్యక్రమాలు నిర్వహించడం, వాటిని పేద ప్రజలకు అందించటం గొప్ప విషయం అన్నారు. నాట్స్ చేపట్టేటువంటి కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని అన్నారు. రెండు రాష్ట్రాల్లో కుట్టు మిషన్ శిక్షణ శిబిరాలు, ఉచిత కంటి వైద్య శిబిరాలు , ప్రభుత్వ పాఠశాలలకు సైకిల్ స్టాండు నిర్మాణం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం, గ్రూప్2 అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేయడం అభినందనీయమన్నారు. నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి మాట్లాడుతూ ఈ మూడు సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించా మని అన్నారు. నల్లమల ఫారెస్ట్‌లో నివసించేటువంటి గిరిజనులకు కూడా నాట్స్ సేవలను విస్తృతతపరిచామని అన్నారు. సభకు సిఐటియు నాయకులు కాకుమాను నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆల్ ఇండియా లాయర్ యూనియన్ నాయకులు నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మూడు సంవత్సరాల కాలంలో నాట్స్ ఆధ్వర్యంలో పెదనందిపాడులో చేపట్టినటువంటి మెగా కంటి వైద్య శిబిరాలు పేద ప్రజలు ఉపయోగించు కున్నారన్నారు. ముందుగా కంటి వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, మాజీ ఎంపీపీ లు నర్రాబాలకృష్ణ ,ముద్దన నాగరాజుకుమారి, పారిశ్రామిక వేత్తలు దాసరి శేషగిరిరావు, అరవపల్లి కృష్ణమూర్తి , ముద్దన రాఘవయ్య, శీలం అంకారావు, కొల్లా సాంబశివరావు మాట్లాడారు. అనంతరం నూతి బాపయ్య చౌదరి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మరియు నర్రా శ్రీనివాస్ లను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 620 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 374 మంది ఆపరేషన్ల కు ఎంపిక చేశారు శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కంటి వైద్య శిబిరం నిర్వహణ కమిటీ సభ్యులు దాసరి సుబ్బారావు, దాసరి రమేష్ ,ఎస్ చౌదరి , లావు శివప్రసాద్ , పి.పోతురాజు, కాకుమాను చెన్నకేశవులు , కే శ్రీనివాసరావు, పి. గోవిందరాజులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



అతిధులను సత్కరించిన నిర్వాహకులు



శిక్షణా తరగతులకు హాజరైన ఆప్కాబ్ ఉద్యోగులు

ఎస్ఆర్ఎంలో ఆప్కాబ్ ఉద్యోగులకు శిక్షణా తరగతులు

ముఖ్య అతిథిగా హాజరైన ఆప్కాబ్ ఎమ్‌డి ఆర్ఎస్ రెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులకు రెండు రోజుల పాటు నైపుణ్య అభివృద్ధి పై శిక్షణా తరగతులు జరిగాయి. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 30 మందికి పైగా కోఆపరేటివ్ బ్యాంకు బ్రాంచి మేనేజర్లు, సీనియర్ ఆఫీసర్లు ఈ వర్క్ షాప్‌నకు హాజరయ్యారు. మేనేజ్మెంట్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద ఉద్యోగులకు నిపుణులు పలు సూచనలు చేశారు. వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచుకోవడమే కాకుండా కస్టమర్ రిలేషన్ షిప్‌ను పెంచుకునే అంశాలను వివరించారు. ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులతో సంభాషించారు. ఎండీపీ ప్రోగ్రాము ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్కుమార్ ఆరోరా, ఇన్ఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కల్లూరి వినాయక్, పారీ స్కూల్ డీన్ డాక్టర్ భరద్వాజ్, శైలజ కొసరాజు తదితరులు పాల్గొన్నారు.

వివిఐటికి ఎన్.బి.ఎ. టైర్1 అక్రిడిటేషన్

ప్రజాశక్తి - తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరుకు ప్రతిష్టాత్మకమైన ఎన్.బి.ఎ.టైర్ 1 అక్రిడిటేషన్ లభించినట్లు ఆదివారం కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. కేవలం వివిఐటి కళాశాలకు మాత్రమే ఎన్.బి.ఎ.టైర్1 అక్రిడిటేషన్ లభించడం విశేషంగా చెప్పారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాలకు మూడేళ్ల కాల పరిమితికి ఈ గుర్తింపు వర్తిస్తుందన్నారు. స్వయం ప్రతిపత్తి గల కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ టైర్ 1 మంజూరు చేస్తుందన్నారు. గుర్తింపు పొందిన విభాగాలలో అత్యున్నత స్థాయి విద్యా ప్రమాణాలు, అధినాతన బోధనా పద్ధతులు సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపకులు కళాశాల ప్రత్యేకతలుగా చెప్పారు. మంచి ఉత్తీర్ణత శాతంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కళాశాల విద్యార్థులు పొందటం, ఇలాంటి నాణ్యత ప్రమాణాలను గుర్తించి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ టైర్ 1 మంజూరు చేసింది అన్నారు. ఈ గుర్తింపు ద్వారా కళాశాల విద్యార్థులకు విదేశీ విద్య సులభం అవుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వివరాలు వెల్లడించిన వారిలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున రెడ్డి, కళాశాల కార్యదర్శి బదరీ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎం శ్రీకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ కే గిరిబాబు ఉన్నారు.

పదిలో సత్తా చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - తెనాలి

పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పట్టణానికి చెందిన జాబిల్లి సేవా సంఘం ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను అందించారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన 15మంది పదో తరగతి విద్యార్థులకు రూ.2వేల చొప్పున నగదు పారితోషకాన్ని, ప్రశంసా పత్రాలను అందించారు. సంస్థ గౌరవాధ్యక్షులు కొసరాజు వెంకట్రావు , అధ్యక్షులు ఆంజనేయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, విశ్రాంత అధ్యాపకులు శైలజ, రాజేశ్వరి, రమాదేవి, పూర్ణచంద్రరావు, అమిరినేని శివరామ ప్రసాదు, సి ఆర్ పి శ్రీదేవి, వేజళ్ల నవ్య, బి. శివరామకృష్ణ విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు చేయూత నిచ్చే ఆశయముతో ఈ కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు ఉమామహేశ్వర్ చెప్పారు.



విద్యార్థులతో జాబిల్లి సేవా సంఘం బృందం



రాత్రి పది వరకే అనుమతి

ప్రజాశక్తి-తాడేపల్లి :సార్వతిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4వ తేదీన జరుగుతున్న సందర్భంగా తాడేపల్లి పట్టణంలోని వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లు రాత్రి పది గంటలకు మూసివేయాలని తాడేపల్లి సిఐ కల్యాణరాజు తెలిపారు. ఆ మేరకు పట్టణంలోని వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లకు తాడేపల్లి ఎస్ఐ రమేష్ ఆదివారం నోటీసులు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమస్యాత్మక గ్రామాల్లో కార్డెన్‌సెర్చ్

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలో సమస్యాత్మక గ్రామాలైన ఈర్లపాడు, కనపర్రు గ్రామాల్లో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లు, అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎస్ఐ బలరాంరెడ్డి హెచ్చరించారు.



అరవిందబాబు నిరసనకు మద్దతు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఎన్నికల పోలింగ్ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారంటూ నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేపట్టిన నిరసన ఆదివారం 6వ రోజుకు చేరింది. కక్ష పూరితమైన రాజకీయలకు వైసిపి అడ్రస్‌గా మారిందని, పోలింగ్ రోజున టిడిపికి ఓటింగ్ శాతం పెరుగుతుందనే అక్కసుతో వైసిపి వారు ఘర్షణలు సృష్టించారని ఆరవిందబాబు ఆరోపించారు. కూటమి అధికారంలోకి రాగానే అందరి లెక్కలూ తేలుస్తామన్నారు. ఇదిలా ఉండగా తన ఇంట్లో నేలపై పడుకుని నిరసన తెలుపుతున్న అరవిందబాబు వద్దకు టిడిపి శ్రేణులు వచ్చి మద్దతు తెలిపాయి.

రేపటి నుండి దేవాదాయ భూముల వేల

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ గ్రూప్ పరిధిలోని దేవస్థానాలకు సంబంధించిన సుమారు 170 ఎకరాల సాగుభూమి బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు వినుకొండ నియోజకవర్గ దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి కొల్లి హనుమంతరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినుకొండ పట్టణంలోని పాత శివాలయం వద్ద గల కోదండరామ స్వామి దేవాలయంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఉదయం 10 గంటలకు బహిరంగ కౌలు వేలం ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు కౌలు దారవతు ముందుగానే చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు 9494999112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కాపు జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బత్తినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బత్తినేని శ్రీనివాసరావును కాపు జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని స్థానిక అడ్డరోడ్డు వద్దగల బత్తినేని శ్రీనివాసరావు కార్యాలయంలో ఆదివారం అందించారు. కార్యక్రమంలో వి.శంకర్రావు, ఎ.భాస్కరరావు, డి.లక్ష్మీనారాయణ, బి.వాసు, టి.వెంకటసుబ్బారావు, ఎ.బుజ్జి, కె.వెంకటేశ్వర్లు, వి.రామకృష్ణ, ఎస్.నాగార్జున, డి.చిరంజీవి, జి.కృష్ణ, ఎ.రాము, బి.కోటయ్య, వివి.శ్రీను, కె.సతీష్, ఎ.రవిచంద్ర పాల్గొన్నారు.



మిరప తోటలో ఎద్దులతో వ్యవసాయం చేస్తున్న రైతు



బలప్రదర్శనకు తర్ఫీదు ఇస్తున్న కొండకావూరు గ్రామ రైతు



దుక్కుల పనుల్లో ట్రాక్టర్

పంటల సాగు నుండి.. బండ లాగుడు పోటీలకు..

ఎద్దుల స్థానాన్ని ఆక్రమించిన ట్రాక్టర్లు.. గ్రాసమూ సమకూర్చలేక అమ్మకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మారిన పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో ఎద్దుల సేద్యం కనుమరుగవుతోంది. ఒకప్పుడు ఎద్దులు లేకుండా పొలంలో పనిని ఊహించలేని విషయం. ఇప్పుడు యంత్ర పరికరాలు అందుబాటులోకి రావడం, ట్రాక్టర్‌తో దుక్కులు దున్నడం, విత్తనం వేయడం, వరి నాట్లు, కోతలు, పంట నూర్పిళ్లు ఇలా మొత్తం కూడా యంత్రాల ద్వారానే చేస్తున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్ సీజన్ ఆరంభం నేపథ్యంలో మే నెలలోనే రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. ఈ నెల ప్రారంభం నుంచే తొలకరి వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దుక్కులు చేసుకోవడానికి సరిపడే తేమ శాతం భూమిలో ఉంది. ట్రాక్టర్ల సాయంతో లోతుగా దుక్కులు దున్నే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పశువుల మీద మక్కువతో కొద్ది మంది రైతులు మాత్రమే దుక్కుల కోసం ఎద్దులను ఉపయోగిస్తుండగా మరికొందరు ఎడ్ల బండలాగుడు పందేల కోసమే ఎడ్లను పోషిస్తున్నారు.

కాడెద్దులను అమ్ముకున్నా



జి.పూర్ణయ్య, రైతు అన్నవరం

పంటలను కూడా యంత్రాలతో కోయడం వల్ల పశు గ్రాసం కొరత ఏర్పడింది. సాధారణ పశువుల కొంటే వ్యవసాయం పనుల్లో ఉండే పశువులు గ్రాసం ఎక్కువ తింటాయి. వాటికి గ్రాసం తెచ్చిపెట్టడం కష్టమవుతోంది. పశుగ్రాసానికి డిమాండ్ పెరిగి మేత దొరకని పరిస్థితి వచ్చింది. దీంతో నాకున్న కాడెద్దులను అమ్ముకున్నాను. పైగా ఎకరా పొలం ఎద్దులతో దున్నాలంటే 2 నుండి 3 రోజుల సమయం పడుతుంది. పంట కోత నూర్పిళ్లతో ట్రాక్టర్‌తో పొలాన్ని సాగు చేసుకుంటున్నా. ట్రాక్టర్‌తో 2 గంటల్లో దుక్కి పూర్తవుతుంది. అందుకే ఎక్కువ మంది రైతులు ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారు.

దుక్కులు లోతుగా దున్నాలి



వి.నరేంద్రబాబు, మండల వ్యవసాయాధికారి

పంట నూర్పిడి అనంతరం పొలంలో మిగిలే పంట మొదళ్లు, మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు లోతు దుక్కులకు నేలలో కలిసి కుళ్లిపోయి భూమి సారవంతమవుతుంది. నేలను లోతుగా దున్నినప్పుడు గట్టి పొర ఛేదించబడి నీటిని పీల్చుకుంటుంది. తర్వాత సాగు చేసే పంటలు కొంత మేర నీటి ఎద్దడి తట్టుకుంటాయి. చీడ పీడలు కూడా తక్కువగా ఆసిస్తాయి. పైరురుకు మంచి పోషకాలు అందడంతోపాటు నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి.

రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గతేడాది కరువుతో పాటు మిచౌంగ్ తుపాను రైతులను తీవ్రంగా నష్టపరిచిందని, వేలకు వేలు పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా దెబ్బతిన్నా ప్రభుత్వం మాత్రం న్యాయం చేయలేదని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. ప్రస్తుతం రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో వారికి ఎరువులు. విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు నిట్టూర్పుగా సాగుకు ముందుకొస్తున్నారని, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా కరువు నెలకొందని, అయినప్పటికీ ప్రభుత్వం కరవు జిల్లాగా పల్నాడును ప్రకటించిలేదని గుర్తు చేశారు. కరువు రైతుల్ని తీవ్రంగా నష్టపరిచిందని, ఎకరాకు రూ.20 వేల పరిహారమైనా ప్రభుత్వం అందించి ఉంటే వారికి కాస్త సాంత్వన దక్కేదని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు, మందుల బెడద నుండి రైతులను కాపాడుకునేందుకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

30 మందిపై రౌడీషీట్లు : సిఐ

చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గంలోని నకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ల, సత్తెనపల్లి రూరల్ మండలంలో 30 మందిపై రౌడీషీట్స్ ఓపెన్ చేసినట్లు సత్తెనపల్లి సిఐ ఎం.రాంబాబు తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముప్పాళ్ల మండలం మాదలలో పెట్రోల్ బాంబ్ కేసులో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. పోలింగ్‌కు ముందు బైండోవర్ చేసిన వారిలో 44 మంది మళ్లీ ఎన్నికల గొడవల్లో పాల్గొన్నారని తెలిపారు. వారిలో 35 మందికి ముప్పాళ్ల తహసిల్దార్ బాండ్ అమౌంటు గవర్నమెంట్‌కు కట్టాలని నోటీసులు ఇచ్చారన్నారు. అయితే 16 మాత్రమే హాజరయ్యారన్నారు. నకరికల్లు మండలం గుళ్లపల్లిలో ఈవీఎం పగలగొట్టిన కేసులో ఇప్పటివరకు 25 మందిని అరెస్టు చేశామని, మిగిలిన వారు పరారీలో ఉన్నారని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘాను ఏర్పాటుతోపాటు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలన్నదే తమ లక్ష్యమని, పోలీసులకు సహకరించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులకు, రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేశారు.

కెబిఆర్ కాంప్లెక్స్‌లో చెత్తను తీయించరూ..



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. స్థానిక స్టేషన్ రోడ్డులో కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో దుకాణ సముదాయంలో ఉండే దుకాణదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చెప్పే స్వచ్ఛ భారత్, క్లీన్ అండ్ గ్రీన్ లాంటివి ఇక్కడ అమలు కావడం లేదని అసహనానికి గురవుతున్నారు. కొన్ని నెలలుగా మురుగు కాల్వలలో పూడికతీత పనులు చేపట్టలేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



పేద విద్యార్థినుల చదువుకు సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బీ టెక్ మొదటి ఏడాది చదువుతున్న పేదింటి చదువుల తల్లికి బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. నకరికల్లు మండలం కండ్లకుంటకు చెందిన గుత్తా వెంకట నాగ స్నేహ నంబూరు వివిఐటి కళాశాలలో బీటెక్ మొదటి ఏడాది విద్యనభ్యసిస్తున్నారు. కళాశాల ఫీజులకు అవసరమైన నగదు కోసం ట్రస్ట్‌కు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు ఆదివారం విద్యార్థిని కుటుంబ సభ్యులకు రూ.25 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ తనకు చేసిన సహాయం మరువలేనిదన్నారు. జీవితంలో ఉన్నత చదువులు పూర్తయిన అనంతరం ట్రస్ట్ స్ఫూర్తితో తానుకూడా పేద విద్యార్థులకు సహాయం చేస్తానని చెప్పారు. కృష్ణారావు మాట్లాడుతూ ట్రస్ట్ స్థాపించిన దగ్గర నుండి ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ప్రతిభ కలిగి పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొల్లు వెంకటేశ్వర్లు, మల్లిపాటి రామకృష్ణ, గోపాలకృష్ణబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన చీకటిగలపాలెం మోడల్ స్కూల్ విద్యార్థిని తడికమళ్ల పూజిత ఇంటర్మీడియట్‌లో చేరడానికి దాతలు రూ.10 వేల సాయం అందించారు. మండలంలోని విఠంరాజుపల్లిలోని సాయి బృందావనం శాంతి ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకులు, ప్రధాన కార్యదర్శి కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, గరే శివారూపేష్ దంపతులు హిమాలయ గురుదేవుల ద్వారా ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో పి.వెంకట మోహన్‌రావు, పి.పుల్లారావు, కె.సుధాకర్, పి.సురేష్, బి.స్వామి, మునిరెడ్డి పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తమవుతున్న రైతులు

ప్రజాశక్తి - తుళ్లూరు


రాజధానేతర గ్రామాల్లో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్ర పురం గ్రామాలను రాజధాని నిర్మాణం నుంచి మినహాయింపు ఇవ్వడంతో పంటల సాగు ప్రక్రియ యధావిధిగా సాగుతోంది. మూడు గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాలలో పత్తి,మిర్చి,మినుము,వరి సాగవుతున్నాయి. నదీ పరీవాహక గ్రామం హరిశ్చంద్రపురంలో అరటి, కంద, పసుపు, కూరగాయలు పండిస్తున్నారు. పెదపరిమిలో ఆరు వేల ఎకరాలలో అత్యధికంగా పత్తి సాగుచేస్తున్నారు. రాజధాని గ్రామాల్లో భూ సమీకరణలో భూములు ఇవ్వని రైతులు కూడా పంటల సాగుకు సమాయత్తమ వుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో చేలల్లో పత్తి కట్టెను పోగుచేసి తగులబెట్టడం, దుక్కులు దున్నడం, చేలను శుభ్రం చేయడం లాంటి పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. నాణ్యమైన విత్తనాల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారు.



పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

పంట ముంపు నివారణ చర్యలేవి..?


ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. ఎప్పటిలానే రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు పంటల సాగు ప్రక్రియ సజావుగా సాగుతుందా.. అన్న అనుమానం రైతులను వెంటాడుతోంది. అధిక వర్షాల కారణంగా కొండవీటివాగు పొంగి వేలాది ఎకరాలు నీట మునిగి పంట నష్టం వాటిల్లిడం అందుకు కారణం. దశాబ్దాలుగా కొండవీటి వాగు కారణంగా డొంకలు, చిన్న చిన్న వాగులు పొంగి లో లెవెల్ చప్టాల మీదుగా వరద నీరు పంటలను ముంచెత్తు తోంది. పెదపరిమిలో కోటేళ్ల వాగు, చీకటివాగు, పెదపరిమి - నీరుకొండ మధ్య వాగు, పెదపరిమి - మోతడక మధ్య వాగులు వల్ల పంటలు నీట మునిగి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పాలకులు కొండవీటి వాగుతో పాటు లో లెవెల్ చప్టాలను హై లెవెల్ చప్టా లుగా అభివృద్ధి చేయడం పట్ల అలసత్వం వహించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కొండవీటి వాగు, చప్టాలను సత్వరమే అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.



జిల్లా కవులకు అన్నమయ్య పురస్కారం

ప్రజాశక్తి - చేబ్రోలు

వచన కవిత్వం విభాగంలో స్థానిక ఉపాధ్యాయుడు మెట్టు శ్రీనివాస రెడ్డికి అన్నమయ్య పురస్కారం అందజేశారు. వచన కవిత్వం కళా రంగంలో ఆయన చేసిన విశేష కృషి అపార అనుభవము, ప్రావీణ్యాన్ని గుర్తించి ఆదివారం ఈ పుర స్కారం ఇవ్వటం జరిగిందని శ్రీనివాసరెడ్డి తెలిపారు. కవిత్వం పై తనకున్న మక్కువతో కృషితో గతంలో సాధించిన అనేక అవార్డులు గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ మరియు ఏఎస్ ఫౌండేషన్ చిత్తూరు సంయుక్తంగా ఈ పురస్కారాలను రాష్ట్రవ్యాప్తంగా 116 మందికి ఇవ్వడం జరిగిందని తెలిపారు. తన అనుభవాన్ని గుర్తించి రాష్ట్ర స్థాయిలో పురస్కారాన్ని ఇవ్వటము చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మడవలి చిరంజీవి మరియు అవిలాల శ్రీధర్, కార్యక్రమనిర్వాహకులు శ్రీనివాస రెడ్డికి అభినందనలు తెలిపారు.



విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

రావెళ్ల కంటి హాస్పిటల్ విజయవాడ వారిచే విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం పాత మంగళగిరిలో ఆదివారం నిర్వహించారు. మంగళగిరి పరిసర ప్రాంత ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకొని నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. కంటి శుక్లాలు ఉన్నవారు కూడా డాక్టర్ల సలహా మేరకు కంటి ఆపరేషన్‌కి తగు సలహాలు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యపరంగా సేవలందించడంలో విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందని ఇప్పటికే పలు గ్రామాల్లో అనేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.



సర్టిఫికెట్ల పంపిణీలో పద్మవల్లి

కుట్టు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

మహిళల ఎదుగుదల, ఆర్థిక స్థిరత్వమే సేవా భారతి లక్ష్యమని ప్రముఖ న్యాయవాది, సంస్థ జిల్లా కార్యదర్శి పద్మవల్లి అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని నివేదిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సేవా భారతి సంస్థ కార్యదర్శి వి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పద్మావతి పాల్గొని మాట్లాడుతూ మహిళలు స్వసక్తితో ఎదిగేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారిని అభినందించారు. అలాగే రెండో బ్యాచ్ శిక్షణ జూన్ 20 నుంచి ప్రారంభం కానుందని ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94417 53817 నంబర్లు సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జె శ్రీనివాస్, టివి ఆదిశేషు, టైలరింగ్ శిక్షకులు వై.రోహిత్, బ్యూటిషన్ శిక్షకులు వి విజయదుర్గ, టి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

లాడ్జీలలో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - పొన్నూరు

జూన్ 4వ తేదీన వెలువడునున్న ఎన్నికల ఫలితాల దృష్ట్యా పొన్నూ రు పట్టణంలోని లాడ్జి లను పొన్నూరు టౌన్ సిఐ పి. భాస్కర్ ఆధ్వ ర్యంలో పోలీస్ సిబ్బంది శనివారం రాత్రి తనిఖీ చేశారు.లాడ్జిలో ఉన్న కొత్త, పాత వ్యక్తులను ఆయన విచారించారు.



ఈ సందర్భంగా అర్బన్ సిఐ భాస్కర్ మాట్లాడుతూ లాడ్జిలో ఎవరైనా అను మానితులు వచ్చిన ఎడల, యజమానులు వెంటనే పోలీస్ వారికి తెలియపరచాలని కోరారు. పట్టణంలో అప రిచిత వ్యక్తులు తారసపడిన, అనుమానస్పదంగా సంచ ̃రిస్తున్న వారి సమాచారాన్ని పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెం టనే తెలియచేయాలని కోరారు. ప్రశాంత ఎన్నికల కౌంటి ంగ్‌నకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు రాజకుమార్, బాబురావు, ఏఎస్ఐ పీఎం సుభాని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కుంచనపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అత్యవసర విద్యుత్తు లైన్లు మరమ్మతులు నిమిత్తం సోమవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి డి మార్ట్, పిడబ్ల్యుడి కాల్వకట్ట పరిసర ప్రాంతాలలో ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ మంగళగిరి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి, విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

చేనేత కార్మికుని వైద్య ఖర్చులకు సాయం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలోని శ్రీ భద్రవతి సమేత భావనాఋషి స్వామి వారి ఆలయంలో స్థానిక పట్టణ పద్మశాలియ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం ఆంజనేయ కాలనీకి చెందిన మునగాల గోవర్ధన్ అనే చేనేత కార్మికుని దవడ సర్జరీ వైద్య ఖర్చులకు రూ. 33 వేల500 ఆర్థిక సాయం అందించారు. సంఘం ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేర స్వామి చేతుల మీదగా గోవర్ధనకు సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంజి రవీంద్రనాథ్, తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్, శలా సత్యనారాయణ పాల్గొన్నారు.




ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం నాయకులు

పూర్ణ ప్రజ్ఞాచారికి స్వర్ణ కంకణ సత్కారం

ప్రజాశక్తి - తెనాలి

అంతర్జాతీయ పద్య కవి సమ్మేళనంలో సాహితీ రత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞా చారిని స్వర్ణ కంకణంతో సత్కరించారు. ఏలూరు వై. యం. హెచ్. ఎ. కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ పద్య కవి సమ్మేళనం నిర్వహించింది. తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారి కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పద్య కవుల నుండి మూడు సీస పద్యాలు, వాటి సంకలనం లోనికి నిర్వాహకులు ఆయనకు ఆహ్వానం పలికారు. డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారి 'కవి ధర్మం' అనే శీర్షికన తన పద్యాలను సంకలనానికి పంపించారు. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళా వేదిక వారు కవులు రాసిన పద్యాలను సీస పద్య వైభవం కావ్యంగా ఆవిష్కరించారు. సీస పద్య వైభవం కావ్యావిష్కరణ సభలో అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త కొల్లి రమావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టి లలిత, జాతీయ కార్యదర్శి డాక్టర్ .టి. పార్థసారధి, వేద పండితులు డాక్టర్ కావూరు శ్రీనివాస శర్మ, ఏలూరు జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీహరికోటి చేతుల మీదుగా డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారిని స్వర్ణం కంకణం, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాచారి మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన కవి సమ్మేళనంలో అరుదైన స్వర్ణ కంకణ ధారణ గౌరవం తనకు లభించటం తన స్వగ్రామం కొలకలూరు కి లభించినట్లేనని చెప్పారు.



ఏలూరులో పూర్ణ ప్రజ్ఞాచారిని సత్కరిస్తున్న శ్రీ శ్రీ కళావేదిక



ప్రజాశక్తి తెనాలి :సాహితీ రంగంలో అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా పట్టణానికి చెందిన ఇరువురు రచయితలు అన్నమయ్య పురస్కారాలు అందుకున్నారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి హెచ్ ఎన్ వి కన్వెన్షన్ లో ఆదివారం సంప్రదాయ కళల పరిరక్షణా సంస్థ, ఏఎస్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక శారదా ఎలిమెంటరీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మునిపల్లె వెంకట రఘునాధరావు, పట్టణానికి చెందిన రచయిత, గుంటూరు 2 డిపో కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు అన్నమయ్య పురస్కారాలు అందుకున్నారు. కళా రంగంలో విశేష సేవలందిస్తున్న పలువురిని 2024 సంవత్సరానికి నిర్వాహక సంస్థలు అన్నమయ్య పురస్కారాలకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. పురస్కారాలు అందుకున్న ఇరువురిని పట్టణానికి చెందిన పలువురు సాహితీ ప్రియులు అభినందించారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండలం వివిధ శాఖల అధికారులతో పాటు, సంస్థ అధ్యక్షులు మడవలి చిరం జీవి, ఎం.తులసి, అభిలాల శ్రీధర్ పాల్గొన్నట్లు పురస్కార గ్రహీ తలు తెలిపారు.

శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన జెసి

ప్రజాశక్తి - పొన్నూరు

చరిత్ర ప్రసిద్ధిగాంచిన సహస్ర లింగేశ్వర స్వామి, శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జెసి రాజకుమారికి ఆలయ మర్యాదలతో అర్చక స్వాములు, దేవస్థానం ఈవో టి. శ్రీనివాస్ సిబ్బంది కలిసి ఆహ్వానించారు. శ్రీ వీరాంజనేయ స్వామికి రాజకుమారి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కు శ్రీ స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఏ కార్యక్రమంలో దేవస్థానం ఈవో తుళ్ళి మిల్లి శ్రీనివాస్, స్థానిక తహసిల్దార్ సూర్య నారాయణ సింగ్, రెవెన్యూ ఇనస్పెక్టర్ రామకృష్ణ, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

నరసరావుపేట డీఎస్పీ ఎం. సుధాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి ఎం. సుధాకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని నరసరావుపేట డిఎస్పి ఎం. సుధాకర్ హెచ్చరించారు. స్థానిక 2వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు నరసరావు పేట పట్టణానికి చెందిన వైసిపి కార్యకర్త జంగాల నెహేమియాపై కేసు నమోదు చేశామని త్వరలోనే నెహేమియాని అరెస్ట్ చేస్తామని చెప్పారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు వీడియోలు ఏ పార్టీ వారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా 2వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో వాటిల్లిన వివాదాల నేపథ్యంలో 8 కేసులు నమోదు కాగా నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 34 కేసులు నమోదు చేశామని 2 కేసులు మినహా అన్ని కేసులలో నిందుతులను అదుపులోకి తీసుకున్నామని మిగిలిన కేసులలో నిందుతులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం

ఓట్ల లెక్కింపు అనంతరం విజేతల అభ్యర్థులు, వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు చేపట్టరాదని, ఎన్నికల కమిషన్ వాటిపై నిషేధం విధించిందని డిఎస్పి ఎం. సుధాకర్ తెలిపారు. డిఎస్పి మాట్లాడుతూ పల్నాడు ఎస్పీ మల్లిక గర్గ్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలో పటిష్ట పోలీసు వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కౌంటింగ్ నిర్వహించే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరూ కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లోనికి వెళ్లరాదని, పట్టణంలో ఎటువంటి అల్లర్లు జరుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. గెలిచినవారు విజయోత్సవ ర్యాలీలు చేయటానికి, బాణసంచా కాల్చడానికి అనుమతిలేదని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న నారాయణ

ప్రతిభకు పట్టం కట్టిన మానవత

ప్రజాశక్తి-గుంటూరు

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, కొరిటాల ఇందిర శేషగిరిరావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన బాలబాలికలను, అందుకు తోడ్పాటు అందించిన పాఠశాలల యాజమాన్యాన్ని ఘనంగా సత్కరించారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్‌లో ఏపీ కాటన్ అసోసియేషన్ హాల్లో డాక్టర్ నూతలపాటి అరవింద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ ఈ.వి.నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కేవలం విద్య ద్వారానే సరైన గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రతి ఏటా రూ.18 వేలు వ్యక్తిగత విరాళాన్ని ప్రకటించారు. కొరిటాల ఇందిర శేషగిరిరావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత కె.శేషగిరిరావు మాట్లాడుతూ స్వదేశంపై మక్కువతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవత అధ్యక్షులు పి.విమలకుమారి సంస్థ చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చి దిద్దడంలో గురువులది ప్రధాన పాత్ర అని కొనియాడారు. డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గుంటూరు నగరంలోని ఆరు పాఠశాలల నుండి 590కి పైగా మార్కులు సాధించిన పది మంది బాల బాలికలకు కొరిటాల ఇందిర శేషగిరిరావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో రూ2వేలు చొప్పున నగదు తోపాటు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా పలువురు 580కి పైగా మార్కులు సాధించటానికి కారకులైన పంతొమ్మిది పాఠశాలల నిర్వాహకులను జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.రేట్ పెయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.నారాయణరెడ్డి ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా రూ.30 వేలు బహుమతిని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవత కోశాధికారి టీవీ సాయిరాం, డైరెక్టర్లు రామబ్రహ్మం, బిఎన్ మిత్ర, మహిళా విభాగం చైర్మన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పాలీసెట్ కౌన్సెలింగ్

ఎంబిటిఎస్, జెఎన్‌టియులో హెల్ప్‌లైన్ సెంటర్లు - జూన్ 7న సీట్ల కేటాయింపు



తేదీల వారీగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సిన ర్యాంకర్లు

తేదీ	ర్యాంకులు	
27వ తేదీ	1	- 12000
28వ తేదీ	12001	- 27000
29వ తేదీ	27001	- 43000
30వ తేదీ	43001	- 59000
31వ తేదీ	59001	- 75000
1వ తేదీ	75001	- 92000
2వ తేదీ	92001	- 108000
3వ తేదీ	108001	- చివరి ర్యాంకు

కావాల్సిన సర్టిఫికెట్లు

- ఫీజు రసీదు
- పాలీసెట్ హాల్ టిక్కెట్
- ర్యాంకు కార్డు
- ఎస్ఎస్‌సి పాస్ సర్టిఫికెట్
- 4-10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లు
- కుల, ఆదాయ ధ్రువపత్రాలు
- ఓసీ అభ్యర్థులు అయితే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్ కాలేజిల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈనెల 27 నుండి జూన్ 3వ తేదీ వరకూ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. నిర్దేశించిన హెల్ప్‌లైన్ సెంటర్లకు ర్యాంకుల వారీగా హాజరై ధ్రువ పత్రాల పరిశీలన పూర్తి అయిన తర్వాత తర్వాత వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. గుంటూరు జిల్లాలో నల్లపాడులోని ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజి, పల్నాడు జిల్లాలో నర్సరావుపేటలోని జెఎన్‌టియులో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ధృవపత్రాల పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు బిసి, ఓసిలు రూ.700లు, ఎస్సీ, ఎస్టీలు రూ.250లు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. కాగా ఎస్టీ అభ్యర్థులు నల్లపాడులోని ఎంబిటిఎస్ కాలేజిలో, ఎన్‌సిసి, పిహెచ్, స్పోర్ట్స్ కేటగిరీ అభ్యర్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజిలో మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. అలాగే మే 31, జూన్ 1వ తేదీల్లో 1-50వేల ర్యాంకుల వరకూ, 2, 3 తేదీల్లో 500001 నుండి 90వేల ర్యాంకుల వరకూ, 4, 5వ తేదీల్లో 90001 నుండి చివరి ర్యాంకు వరకూ వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలి. 5వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పులకు అవకాశం కల్పించారు. జూన్ 7న సీట్లు కేటాయింపు జరుగుతుంది. కౌన్సెలింగ్ కోసం విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంబిటిఎస్ కాలేజి ప్రిన్సిపాల్ టి.శేఖర్ తెలియజేశారు.

ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

నల్లపాడులోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజిలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఉద్యోగ విజయోత్సవ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపిఎస్ఆర్ఎల్ పవర్‌గ్రిడ్, విజయవాడ సీనియర్ జనరల్ మేనేజర్ కె.ఎన్.ఎం.రావు, తులసి సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ యండి తులసి యోగీష్ చంద్ర, సాంకేతిక విద్య కమి షనర్ కార్యాలయ డిడి డాక్టర్ బి.కళ్యాణ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఉద్యోగ నియామకపత్రాలను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదువులు చదవాలని కెఎన్ఎం రావు సూచించారు. తులసి యోగీష్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు తమ సంస్థలో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. డాక్టర్ కళ్యాణ్ మాట్లాడుతూ డిప్లొమా ద్వారా ఉద్యోగావకాశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కెఎన్ఎం రావు, తులసి యోగీష్‌చంద్ర తదితరులు

సాగు కాలువలు ఇలా... నీరు పారేదెలా..




ఈపూరు మండలంలో సిమెంట్ లైనింగ్ దెబ్బతిన్న పెరుమాళ్ళపల్లి మేజర్, చెట్లు,ముళ్ళ పొదలు వ్యర్థాల తో అంగలూరు మేజర్ కాల్వలు

ప్రజాశక్తి - ఈపూరు

ఆరుగాలం కష్టపడి రైతన్నకు అడుగడుగున అవస్థలే. 20 రోజులలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. మండలంలో పెరుమాల్లపల్లి, అంగలూరు, ఇనిమెల్ల మేజర్ ఆయకట్టు ద్వారా 15వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. సక్రమంగా నీరు పారెందుకు కాలువలలో ఏర్పాటు చేసిన సిమెంటు లైనింగులు దెబ్బ తినడం,పేరుకు పోయిన పూడిక, వ్యర్థాలతో పంట కాలువలు దర్శనమిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ముందు వంటకాలవలు అధ్వానస్థితిలో ఉండటంతో సాగునీరు ప్రవహించడం కష్ట సాధ్యమేనని రైతుల అంటున్నారు. అధికారులు కాలువల నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో పంటలకు సాగునీరు అందించే కాలువలు రూపురేఖలు కోల్పోతున్నాయని ఆయకట్టు పరిధిలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇనిమెళ్ళ, అంగలూరు మేజర్ కాలువలకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో వంటకాలువ లైనింగ్ గోడలకు పగుళ్ళు వచ్చి కూలిపోతున్నాయి. సాగునీరు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది, మొక్కలు తొలగించి కాలువకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు. కాలువల ఆధునీకీకరణకు నోచుకోకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి నెలకొంది. ఏటా సాగునీటి కొరత ఏర్పడు తుండటంతో సాగునీటిపై కొంతమంది రైతులు ఆశలు వదులుకొని పొలాల్లో బోర్లు వేయించుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు. వంటకాలువలను అభివద్ధి చేసి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించేలా అధికారులు చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి : నర్రా పూర్ణయ్య రైతు



అంగలూరు మేజర్ కాలువలో సిమెంట్ లైనింగ్ లు దెబ్బతిని సాగునీరు ముందుకు సాగటం లేదు. దీంతో చివరి ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ మయ్యే సమయానికి అధికారులు కాలువల బాగోగులు పట్టించుకోవాలి.

ముళ్ల పొదలతో అధ్వానంగా కాల్వలు : ఎం.హర్షవర్ధన్ రావు



అధికారులు కాలువల నిర్వహణ పట్టించు కోకపోవడంతో ఇరువైపులా పిచ్చి మొక్కలు వేపుగా పెరిగాయి. కాలువలు పూడిక, రాళ్ళ, వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో సాగునీరు విడుదల చేసినప్పుడు నీరు ముందుకు సాగటం లేదు. పొలానికి నీరు పెట్టుకునేందుకు రైతన్నలు అవస్థలు పడుతున్నారు.